క్లుప్తంగా

ఏడిదలో ఉచిత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిదలో గురువారం పీవీఆర్ నారాయణరెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. ఆయనకు బీపీ పరీక్ష చేస్తూ ఆసుపత్రి గైనకాలజిస్ట్ మాధురి, జనరల్‌సర్జన్ నిఖిల్ వైద్య సేవలను ప్రారంభించారు. గ్రామానికి చెందిన రోగులకు ఈసీజీ, ఎకో, బీపీ, షుగర్ తదితర పరీక్షలను చేసి వైద్య సలహాలనిచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రతినిధులు దీపిక, పి.చిట్టిబాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

భగవంతునిపై భక్తి ఉండాలి



శివుని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీరాములు మాస్టారు తదితరులు

కాజులూరు: ప్రతి ఒక్కరూ భగవంతునిపై భక్తి కలిగి ఉండాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగ నేత, గొల్లపాలెం మాజీ ఎంపీటీసీ మెడిశెట్టి వెంకట రమణమ్మ అన్నారు. స్థానిక నాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు మెడిశెట్టి శ్రీరాములు మాస్టారు అతని భార్య సూర్యకాంతం జ్ఞాపకార్థం శ్మశానవాటిక ముఖద్వారంలో మహాశివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మనిషి సమస్యలకు దూరంగా ఉంటూ మానసిక ప్రశాంతతను పొందగలుగుతాడన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ మిలట్రీ ఆఫీసర్ మెడిశెట్టి రామకృష్ణయ్య, స్థానిక నాయకులు ముషిణే నాగేశ్వరరావు, గీసాల బీమేశ్వరరావు, చిట్టూరి నాభూషణం, కడలి రాంపండు తదితరులు పాల్గొన్నారు.

ఫణికృష్ణారెడ్డి సేవలు ప్రశంసనీయం



రాయవరంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాయవరం: గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా వలంటరీ బ్లడ్అండ్ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, కాంచన అగరబత్తి అధినేత సత్తి వీర్రాఘవరెడ్డి ఆధ్వర్యంలో 25వ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రాయవరం పరిసర గ్రామాలకు చెందిన 160 మంది వైద్య సేవలు పొందారు. 35 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు మాట్లాడుతూ ఫణికృష్ణారెడ్డి గత 25 సంవత్సరాలుగా నిర్విరామంగా నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడమే కాకుండా రక్తదానాన్ని ప్రోత్సహించడాన్ని ప్రశంసించారు. శిబిరంలో స్థానిక నేతలు కర్రి తాతారావు, లంక చందు, భక్తాంజనేయ భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిదలో గురువారం మేనెలకు సంబంధించిన సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భర్త చనిపోయిన వారికి నెలరోజుల వ్యవధిలోనే స్పౌస్ పింఛన్‌ను అందించామన్నారు.

సమ్మర్ క్లాసులను తనిఖీ చేసిన డీఈవో

రావులపాలెం: ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్లాస్‌లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. రావుపాలెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్లాస్‌లను డీఈవో బాషా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో బాషా మాట్లాడుతూ జిల్లాలో రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రావులపాలెం, మండపేట, ఏడిద, రామచంద్రపురంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల సహకారంతో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో బేసిక్స్ నేర్పిస్తున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి ప్రారంభమైన సమ్మర్ క్లాస్‌లు ఈ నెల పదో తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారులు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు, పాఠశాల హెచ్‌ఎంలు జానకీదేవి, సీఆర్‌ఎంటీలు మల్లేశ్వరపు నాగరాజు, మొల్లేటి రాజేంద్రప్రసాద్, మారే శ్రీనివాస్, మారే రాజాబాబు తదితరులు ఉన్నారు.

7న ఆలయ భూముల కౌలు వేలం

సఖినేటిపల్లి: మోరి గ్రామ శివాలయం భూముల కౌలు వేలం ఈ నెల 7వ తేదీన ఆలయం వద్ద జరుగుతుందని ఆలయ అధికారులు గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తగిన ధరావత్తుతో వేలంలో పాల్గొనవచ్చునని అధికారులు తెలిపారు.

పొలాలకు నిప్పు.. భూసారానికి ముప్పు

- పొలాలకు నిప్పు పెడుతున్న రైతులు
- వద్దని చెబుతున్న అధికారులు

కె.గంగవరం: ప్రస్తుతం రబీ పంట చివరి దశకు చేరింది. పనులు పూర్తి చేసుకున్న రైతులు పంట పొలాల్లో ఉన్న పనికిరాని ఎండుగడ్డికి నిప్పంటిస్తున్నారు. యంత్రాల ద్వారా పంట కోసిన పొలాల్లోని గడ్డి ఎందుకూ పనికిరాకపోవడంతో దానిని అక్కడే వదిలేసి మంట పెడుతున్నారు. దీనివల్ల భూమికి ముప్పుడు ఏర్పడుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల్లో గ్రామాల్లో ప్రస్తుతం రైతులు పంట పొలాలకు నిప్పు పెడుతున్నారు. ఇదే క్రమంలో మండలంలోని దంగేరు, కుందూరు, పేకేరు, కోటిపల్లి, తామరపల్లి తదితర గ్రామాల్లో రైతులు పంట పొలాలకు వేసిన మంటలను ఆర్పడానికి ఫైర్ ఇంజన్లు రావల్సివచ్చింది. నిప్పు పెట్టడడం వల్ల క్రమక్రమంగా మంటలకు గాలి తోడై పొలాల్లోని పాకులు, గడ్డి మేటులు కూడా అంటుకుపోతున్నాయి. దీనికి తోడు ఎండలు విపరీతంగా ఉండడం దీనికి ఈ మంటలు తోడవడం వల్ల సామాన్య జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాత్రి సమయాల్లో కూడా రైతులు పంట పొలాలకు నిప్పు పెట్టడడం వల్ల వేడిగాలులు వీస్తున్నాయని ప్రజలు అంటున్నారు. అయితే మరో వారం రోజుల పాట రైతులు సమయమనం పాటించాలని పంట పొలాలకు నిప్పు పెట్టొద్దని ప్రజలు కోరుకుంటున్నారు.



కె.గంగవరం మండలంలో నిప్పు పెట్టిన పొలాలను నీళ్లు పోసి ఆర్పుతున్న రైతులు

తగ్గనున్న భూసారం

మాసుళ్లు పూర్తి చేసిన పంట పొలాల్లోని గడ్డిని తగలుపెట్టడడం వల్ల భూమిలోని అతి సూక్ష్మజీవులు చనిపోయి భూసారం కోల్పోతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. భూమి సారవంతాన్ని కోల్పోతుంది. దీంతో మళ్లీ పంటకు కావాల్సిన పోషకాలు భూమిలో తగ్గిపోతాయి. అంతేకాకుండా గాలి కాలుష్యం ఏర్పడుతుంది. దీనివల్ల రైతులకు ఏ ఉపయోగం ఉండదని, అదే పొలంలో సూపర్ పాస్పేట్ వేసి దమ్ము చేస్తే దుబ్బులు, గడ్డి బాగా చివికిపోయి భూమిలో కలసి భూసారం పెరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నేడు బుచ్చి సర్వారాయుడు జయంతి

కపిలేశ్వరపురం: గ్రామ జమీందారు బలుసు బుచ్చి సర్వారాయుడు 134వ జయంతిని శుక్రవారం సర్వారాయ ఎడ్యుకేషనల్ ట్రస్టీ డాక్టర్ ఎస్‌బీపీపీ రామ్మోహన్ పర్యవేక్షణలో నిర్వహించనున్నట్టు సర్వారాయ హరికథా, వేద పాఠశాలల కరస్పాండెంట్ ఎస్.మూర్తి గురువారం తెలిపారు. పాఠశాల విద్యార్థులతో హరికథా ప్రదర్శన, వేద ప్రవచన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కె.గంగవరం: స్థానిక సబ్‌స్టేషన్‌లో పాడైపోయిన 11కేవీ బ్రేకర్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్న కారణంగా కె.గంగవరం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ విషయాన్ని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాల రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.గంగవరంతో పాటు తామరపల్లి, సత్యవాడ, కుందూరు గ్రామాలకు వ్యవసాయ, గృహవినియోగదారులతో పాటు దంగేరు గ్రామానికి చెందిన వ్యవసాయ, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గిన్నిస్ రికార్డులో రామచంద్రపురం బాలిక

రామచంద్రపురం: పట్టణంలోని తోటవారి వీధికి చెందిన కోటపాటి నక్షత్ర గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సంపాదించారు. ఈ మేరకు వివరాలను తల్లిదండ్రులు రామచంద్ర, నవత గురువారం స్థానిక విలేకరులకు వెల్లడించారు. నక్షత్ర గుజరాత్‌లోని వడోదరలో శబరీ స్కూల్, ఆరోత రగతి చదువుతుంది. సంగీతంపై ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు హశిల్ మ్యూజిక స్కూల్ నిర్వహించే ఉచిత సంగీత శిక్షణ కార్యక్రమంలో చేర్పించారు. అగస్టిన్ దండింగి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ శిక్షణ ద్వారా స్వరాలు, కీబోర్డ్ వాయిద్యంపై నక్షత్ర నైపుణ్యం సంపాదించింది. 2024 డిసెంబర్ 1న నిర్వహించిన ప్రపంచ స్థాయి సంగీత కార్యక్రమంలో 18 దేశాల నుంచి మొత్తం 1090 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా కీబోర్డ్ పై సరళి స్వరాలు వాయించగా 1046 మంది విద్యార్థులు అర్హత సాధించినట్టు వారు తెలిపారు. అందులో నక్షత్ర కూడా ఉందని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 25న విజయవాడ మెట్రోపాలిటన్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఈ రికార్డ్ సర్టిఫికెట్‌ను గిన్నిస్ అధికారుల చేతుల మీదుగా నక్షత్ర అందుకుందని తెలిపారు. నక్షత్రని స్కూల్ యాజమాన్యం, సంగీత బోధకులు, తల్లిదండ్రులు, ప్రముఖులు అభినందించారు.



గిన్నిస్ సర్టిఫికెట్‌ను అందుకున్న నక్షత్ర

నిబంధనలను విస్మరిస్తే చర్యలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో నిబంధనలు విస్మరించిన హోటళ్ల, రెస్టారెంట్లు, టీ దుకాణాలు, బార్, అండ్ వైన్ షాపులపై చర్యలు తీసుకొంటామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం పట్టణంలోని హోటళ్ల, రెస్టారెంట్లు, టీ దుకాణాలు, బార్, అండ్ వైన్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ దుకాణాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాల అమలు నాణ్యత మెరుగుపడాలన్న అంశంపై యాజమానులకు పలు ఆదేశాలిచ్చారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు అరటి, విస్తరి ఆకులను వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, కాగితపు గ్లాసులలో టీ అందజేస్తుండడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ప్రత్యామ్నాయంగా గాజు గ్లాసులు, పింగాని కప్పులు, స్టీల్ గ్లాసుల్లో టీని అందించాలన్నారు. హోటళ్లలో ఆహార పదార్థాలను తయారు చేసే, సరఫరా చేసే సిబ్బందికి ఆరోగ్య ఫిట్‌నెస్ సర్టిఫికెట్ విధిగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తోన్న బార్ అండ్ రెస్టారెంట్లపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నియమ నిబంధనలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు వివరించారు. కార్యక్రమంలో వార్డు శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శిలు పాల్గొన్నారు.



మండపేట మున్సిపల్ కార్యాలయంలో హోటళ్ల యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్

ఉపాధ్యాయుని కృషి సమాజాభివృద్ధికి దోహదం



మండపేటలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): విద్యా బోధనలో ఉపాధ్యాయుని కృషి సమాజాభివృద్ధికి దోహదమవుతోందని మండపేట పట్టణంలోని ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ ఉపాధ్యాయులు మాదేపల్లి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక కమ్మ మహాజన సంఘం మండపంలో బుధవారం హెచ్‌ఎం నాగకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావు దంపతులను సత్కరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చదువులమ్మ ఒడిలో 30 ఏళ్ల నాటి అనుబంధాలు గుర్తు చేసుకుంటూ...

రామచంద్రపురం రూరల్: చదువులమ్మ ఒడిలో ఆడుతూ, పాడుతూ 1993–94లో ద్రాక్షారామ శ్రీ పీవీఆర్ హైస్కూల్ పదో తరగతి చదువుకున్న వారంతా గురువారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ రోజంతా సందడి చేశారు. ఒకరినొకరు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. గురువారం పీవీఆర్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. పూర్వవిద్యార్థులందరూ వారి కుటుంబాలతో సహ హాజరై ఆజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌వీఆర్ భీమాస్ ఫంక్షన్ హాలులో తమకు చదువు చెప్పిన అప్పటి గురువులను ఘనంగా సత్కరించి వారిపై తమ గౌరవాన్ని చాటుకున్నారు.



ద్రాక్షారామలో తమ ఉపాధ్యాయులతో 1993-94 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

శ్రామిక ఐక్యతతో సామాజిక మార్పు

- మేడే వేడుకల్లో కార్మిక నేతల ఉద్ఘాటన
- గ్రామాల్లో అరుణ పతాక ఆవిష్కరణ

కపిలేశ్వరపురం: విశాల క్షేత్రంలో శ్రామికుల ఐక్యతతో సామాజిక మార్పు సాధించవచ్చని గురువారం నిర్వహించిన మే డే ఉత్సవాల్లో కార్మిక సంఘాల, ప్రజా సంఘాల నేతలు అన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి వేర్వేరు సామాజిక మాధ్యమాల్లో శ్రామిక సోదరులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. అంగర, కపిలేశ్వరపురంలలో సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాలు, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మేడే జెండాలను ఆవిష్కరించారు. అంగరలోని కామ్రేడ్ తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం వద్ద అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎం.బేబి, ఎం.జానకి, యూటీఎఫ్ నాయకులు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు, గుడిమెట్ల భీమేశ్వరరావు, తాపీమేస్త్రీల సంఘం నాయకులు పెద్దింశెట్టి సూరిబాబు, నాగపండు, రామకృష్ణ, ప్రగతి ఆటో వర్కర్స్, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, వీవోఏ సంఘాల నాయకులు మాట్లాడుతూ శ్రామికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలన్నారు.

- స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ చల్లా రవికుమార్ వేడుకల్లో మాట్లాడారు.
- ఐఎఫ్‌టీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద వంతెన నుంచి కొత్త బస్ స్టాండ్‌వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షురాలు టాన్యా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకట్ల వెంకటేశ్వరరావు, వెంటపల్లి భీమశంకరం, కిరణ్ కుమార్, బి.సిద్ధు, చందు, నల్లా శ్రీను, చల్లా శ్రీను పాల్గొన్నారు.
- కరాచీ సెంటర్‌లో అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ, టీఎన్‌టీయూసీ, దళిత నాయకులు నివాళులు అర్పించారు.

కేశవరంలో శ్రమ జీవుల చైతన్య బిల్డింగ్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు వైరాల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.శివనాగ మల్లేశ్వరరావు అతిథిగా హాజరై మాట్లాడారు.

- మండపేట మున్సిపాలిటీ ఇంజినిరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలోనూ, మున్సిపల్ కార్యాలయం వద్ద టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



రాయవరంలో మేడే సందర్భంగా ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మిడ్డే మీల్స్ వర్కర్లు



మండపేటలో శ్రామికులనుద్దేశించి మాట్లాడుతున్న రవికుమార్, కృష్ణవేణి

రాయవరం మండలంలో..

రాయవరం: కార్మిక, కర్షక వర్గాలు ఎదుర్కొనే సమస్యలపై మేడే స్ఫూర్తిగా పోరాటాలు సాగిస్తామని సీఐటీయు మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. రాయవరంలో గురువారం పలు సంఘటిత, అసంఘటిత రంగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మే డే ఉత్సవాన్ని ఉద్దేశించి అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్, స్కూల్ శానిటేషన్ ఆయా అసోసియేషన్ యూనియన్ నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్, స్కూల్ శానిటేషన్ అసోసియేషన్ నేతలు ఎస్.కృష్ణకుమారి, వై.పద్మావతి, సీహెచ్.సత్యవేణి, ఎం.కమల, ఎస్.నూకరత్నం, బి.కమల తదితరులు పాల్గొన్నారు. భక్తాంజనేయ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం, ఎలక్ట్రీషియన్స్ అండ్ ఫ్లంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేడే సందర్భంగా జెండా ఎగురవేసి ర్యాలీ నిర్వహించారు.

కె.గంగవరం మండలంలో..

కె.గంగవరం: హక్కుల సాధన కోసం కార్మికులందరూ సంఘటితం కావాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, బి.సిద్ధూ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కె.గంగవరం బస్టాండ్ సెంటర్ వద్ద కార్మికులతో కలసి భీమశంకరం, సిద్ధూ ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయు నాయకులు చింతా రాజారెడ్డి, వినకోటి సత్యనారాయణ, చిర్రా రాజ్‌కుమార్, కె, చిన్నారావు, పనసయ్య, మార్తమ్మ, భద్రమ్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: నియోజకవర్గంలో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో లారీ మోటారు యూనియన్ దగ్గర ఏఐటీయూసీ పతాకాన్ని డాక్టర్ సి స్టాలిన్ ఆవిష్కరించారు. మున్సిపల్ కార్మికుల కాలనీ రెల్లి వీధిలో ఏఐటీయూసీ పతాకాన్ని పట్టణ అధ్యక్షుడు వి.గోపాలరావు స్థానిక బీర్ ఫ్యాక్టరీలో యూనియన్ సీనియర్ సభ్యులు ఎస్ శ్రీను, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.సత్తిబాబు, మున్సిపల్ కార్యాలయం దగ్గర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బండి సత్యనారాయణ, పతాకాన్ని ఎగురవేశారు. డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో పట్టణ కార్యదర్శి గొరుపర్తి రాజులు ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి నాయకులు ఎం.ప్రమానందం, ఎస్.శారదాదేవి, కే చంద్ర రావు, గోవిందరావు,వి రాంబాబు, సరోజ, లారీమోటార్ యూనియన్ నాయకులు జి.చక్రవర్తి, టి.శ్రీనివాసరావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వడ్డాది రాజు, ఏ మాచవరం, మీసాల గోపి, వడ్డాది తిరుమల్ రావు, సింగం పిల్లి అనిల్,ఎస్ సుధా, ముత్యాల సుజాత బీర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ నాయకులు తోట సూరిబాబు, కే వరప్రసాద్, ఎం.నాగేశ్వరావు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డీఎం రావు, సీహెచ్ నాగరాజు, గన్నయ్య, కార్మికులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్ : ద్రాక్షారామ స్థానిక యానం రోడ్డులోని భీమేశ్వర గూడ్స్ ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద మే డే ఎరజ్రెండాను సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, భీమేశ్వర గూడ్స్ అండ్ ఆటో ఓనర్స్ వర్కర్స్ యూనియన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు పాండు సంయుక్తంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధు, ఐఎఫ్టీయూ నాయకులు చింతా రాజారెడ్డి, శ్రీ భీమేశ్వర గూడ్స్ అండ్ ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాలిక సత్తిబాబు, వీరాంజనేయులు, ధనరాజు, పి.శ్రీనివాసు పారిశుధ్య కార్మిక నాయకుడు మీసాల సత్యనారాయణ, చిన్నారావు, వేలిగారపు సత్యనారాయణ, సత్యనారాయణ, వెంటపల్లి రామకష్ణ, గుబ్బల శ్రీనివాసరావు చల్లపూడి పట్టాభి రామయ్య, రిక్షా కార్మికులు పులుగు రామచంద్ర రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు

కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయి

కాజులూరు: ప్రజా సంక్షేమంకోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పని చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాలలో కార్మిక దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా జరుపుకొన్నారు. కాజులూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజబాబు మేడే జెండాను ఆవిస్కరించారు. అనంతరం గ్రామంలో ఎర్రజెండాలతో ర్యాలీలు నిర్వహించారు. గొల్లపాలెంలో శ్రీ వీరవెంకటేశ్వర లేబర్‌కాంట్రాక్ట్ సొసైటీలో సంఘ కార్యదర్శి పెంకే సత్యనారాయణ ఆధ్వర్యంలోనూ, కాజులూరులో భవన నిర్మాణ కార్మికసంఘం నాయకుడు యాళ్ళ సత్తిబాబు ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో సీఐటియూ నాయకులు సత్యదుర్గా, సత్యవేణి, సుమలత, లావణ్య, అంగన్‌వాడి సెక్టారు లీడరు టి వరలక్ష్మి, మంగాదేవి, కౌలు రైతుసంఘ నాయకులు కురుపూడి భూచక్రం తదితరులు పాల్గొన్నారు.



లారీ మోటారు యూనియన్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించిన స్టాలిన్



ద్రాక్షారామలో జరిగిన మేడే వేడుకల్లో కార్మికులు



కె.గంగవరంలో...



కాజులూరులో ఎర్రజెండాలతో సీఐటీయూ సభ్యుల ర్యాలీ